
I

సాక్షి
ఖమ్మం

ఆదివారం । 15 । జూన్ । 2025



- బిడ్డల బాగు కోసం అనుక్షణం తపన
- పిల్లలకు ఏ కష్టమూ రాకుండా విద్యాబుద్ధులు
- సంతానం ఉన్నత స్థితికి చేరడంలో కీలకంగా తండ్రి

నేడు ఫాదర్స్ డే

నాన్నే స్ఫూర్తి.. నిలువెత్తు కీర్తి

ఒకరు కూలీ.. ఇంకొకరు హమాలీ.. మరొకరు చిరుద్యోగి.. వీరే కాక సన్నకారు రైతులు, రోజు వారీ గుమస్తాలు ఇలా ఎవరైనా, చేస్తున్న పనేదైనా తమ పిల్లలు మాత్రం ఉన్నత స్థాయికి చేరుకోవాలనే కోరుకుంటారు. అందుకోసం తమ ఇష్టాలు, సుఖాలను వదులుకుని గంట అదనంగా కష్టపడడానికైనా వెనుకాడరు. అలా చదివించి, శిక్షణ ఇప్పించిన ఎందరో తండ్రుల కష్టంతో బిడ్డలు ఉన్నత స్థాయికి చేరి 'నాన్న' గర్వించేలా చేస్తున్నారు. జిల్లాలోని ఇలాంటి కొందరు తండ్రులు, బిడ్డల కథనాలు నేడు(ఆదివారం) ఫాదర్స్ డే సందర్భంగా.... ....

మెకానిక్ తనయుడు న్యాయమూర్తి



చాంద్‌పాషాతో కుమారులు ఆరిఫ్, ఆసిఫ్

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం బొమ్మన సెంటర్‌లో టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్న షేక్ చాంద్‌పాషా వచ్చే అరకొర సంపాదనతోనే కుటుంబాన్ని పోషిస్తూ పిల్లలను ఉన్నతస్థాయికి చేర్చాడు. పెద్ద కుమారుడు ఆరిఫ్ డిగ్రీ అనంతరం టైప్ నేర్చుకుని కోర్టులో ఉద్యోగం సాధించాడు. అంతటితో ఆగకుండా లా పూర్తి చేసి జడ్జిగా ఎంపికయ్యాడు. తొలుత కాజీపేట రైల్వే కోర్టులో జడ్జిగా పనిచేశాక, ప్రస్తుతం నకిరేకల్ కోర్టులో జూనియర్ సివిల్‌జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇక చాంద్ రెండో కుమారుడు ఆసిఫ్ హైదరాబాద్‌లో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ విషయమై చాంద్ మాట్లాడుతూ 'నాకొచ్చేది చాలీచాలని ఆదాయమే అయినా ఆ విషయాన్ని పట్టించుకోకుండా చదువుపై దృష్టి సారించాలని బిడ్డలకు సూచించా. అలా వారు శ్రద్ధగా చదివి ప్రయోజకులు అయ్యారు. ఇంతకంటే ఆనందం ఏముంటుంది' అని వెల్లడించాడు.

ఒకరు ఐపీఎస్, ఇంకొకరు సీఏ



కుమారులతో కృష్ణయ్య దంపతులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం భీమవరం హరిజనవాడలోని పేద కుటుంబానికి చెందిన కోట కృష్ణయ్య – వజ్రమ్మ దంపతులకు ఇరువురు కుమారులు. చిన్నప్పటి నుండి కృష్ణయ్య పేదరికాన్ని అనుభవించారు. భీమవరంలోని పలువురు రైతుల వద్ద ఏటా రూ.3వేల జీతానికి పనిచేశాడు. ఆయన భార్య వజ్రమ్మ కూడా కూలీ పనులకు వెళ్లేది. అయినా రూపాయి రూపాయి పోగేసి పిల్లలు శ్రద్ధగా చదువుకునేలా చూశారు. తద్వారా ఓ కుమారుడు బాబురావు రామగుండం సీసీఎస్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. చిన్న కుమారుడు కిరణ్‌కుమార్ ఐపీఎస్ సాధించి ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలో రోహతాస్ జిల్లాలో ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆది నుంచి కష్టాలను ఎదుర్కొన్నప్పుడు బిడ్డలు ఉన్నత స్థాయికి చేరడంతో కృష్ణయ్య దంపతులు ఆనందంలో ఉండగా.. స్థానికులు వారి కృషిని అభినందిస్తున్నారు.

డ్రైవర్‌గా పనిచేస్తూనే...



శ్రీనివాస్‌తో స్నేహ మృదుల

ఖమ్మంక్రైం: రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి.. పెద్ద చదువులు లేకున్నా పిల్లలను ఉన్నత స్థానంలో చూడాలన్న ఆయన కల నెరవేరుతోంది. ఖమ్మం మంచికంటినగర్-2లో నివాసముండే తమ్మన బోయిన శ్రీనివాస్ వ్యవసాయ మార్కెట్‌లో సరుకులను తరలించే వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కుమార్తె అయిన స్నేహ మృదుల చిన్నతనం నుంచే చదువులో మేటిగా ఉండటంతో భార్య విజయ సహకారంతో కష్టపడి చదివించాడు. స్నేహ ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 89వ ర్యాంక్ సాధించి హైదరాబాద్ ఐఐటీలో సీఎస్ఈ(ఏఐ) సీటు సాధించింది. ఈసందర్భంగా స్నేహ మృదుల మాట్లాడుతూ తాను కష్టపడుతున్నా బిడ్డలు ఉన్నత స్థాయికి చేరాలన్న నాన్న కలను నెరవేరుస్తుండడం ఆనందంగా ఉందని తెలిపింది.

ఎంవీఐగా రైతు బిడ్డ



తండ్రి రామకృష్ణతో వరప్రసాద్

వైరా: తన కష్టం బిడ్డలు పడొద్దని తపించే వారిలో ఆచంట రామకృష్ణ ఒకరు. ఏపీలోని ఏలూరు జిల్లా దెందులూరు మండలం కొవ్వలికి చెందిన ఆయనకు ఐదెకరాల భూమి ఉంది. రామకృష్ణకు కుమారులు వరప్రసాద్, సురేష్ ఉండగా, బిడ్డలు మంచి ఉద్యోగాలు చేసి పేరు సాధించాలని భావించేవాడు. ఈక్రమంలోనే వరప్రసాద్‌ను బీటెక్ వరకు చదివించగా ప్రస్తుతం వైరా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక సురేష్ చిరు వ్యాపారం చేసుకుంటున్నాడు. 'కష్టపడండి.. ఉన్నత ఉద్యోగాలు చేయండి.. పది మందికి సాయపడండి..' అని చెప్పే తండ్రి మాటలే తమకు ఆదర్శమని వరప్రసాద్ చెబుతారు.

తండ్రి కృషి.. డాక్టర్‌గా బిడ్డ



సాయికి స్వీట్ తినిపిస్తున్న జగన్మోహన్‌రావు

తిరుమలాయపాలెం: కుమారుడు జన్మించినప్పుడే డాక్టర్‌గా చూడాలని ఆ తండ్రి కల కన్నాడు. ఆ కల నిజమయ్యేలా కష్టపడి చదవడం అలవాటు చేయడంతో తండ్రి కోరికను నెరవేర్చిన బిడ్డ ఇప్పుడు పేదలకు వైద్య సేవలందిస్తుండడం విశేషం. తిరుమలాయపాలెం మండలం బీరోలుకు చెందిన బత్తిని జగన్మోహన్‌రావు గ్రామాల్లో తిరుగుతూ వాయిదాల పద్ధతిలో వస్తువులు అమ్మే వ్యాపారం చేస్తాడు. పూసల కుటుంబంలో పుట్టిన ఆయనలాంటి ఇంకొందరు పిల్లలను సైతం అదే వ్యాపారం చేయిస్తున్నారు. కానీ జగన్మోహన్‌రావు చిన్న నాటి నుండే పిల్లలపై శ్రద్ధ వహిస్తుండగా కుమారుడు సాయికుమార్ ఎండీ (జనరల్ మెడిసిన్) పూర్తి చేసి కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా సేవలందిస్తున్నాడు. అంతేకాక కుమార్తె రాణి బీటెక్ పూర్తిచేసింది. కుమారుడిని మెడిసిన్ చదివించే సమయాన ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదల వీడని జగన్మోహన్‌రావు ఇప్పుడు సాయి ఎదుగుదలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

తండ్రి ప్రోత్సాహంతో విదేశాలకు..



తండ్రి గఫార్‌తో ఫర్వేజ్

సత్తుపల్లిటౌన్: 'నాన్న ప్రోత్సాహంతోనే సింగపూర్‌లో ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డా.. ఆయన ఎన్ని కష్టాలు పడినా మాకు ఆనందాన్ని పంచుతూ జీవితంలో రాణించేలా తీర్చిదిద్దారు. అందుకే నాన్నే నా హీరో..' అంటున్నారు సత్తుపల్లి ఆర్టీసీ డిపో డ్రైవర్ షేక్ అబ్దుల్ గఫార్ కుమారుడు షేక్ తాబేర్ పర్వేజ్. 1996 నుంచి గఫార్ ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా కుమారుడు పర్వేజ్‌ను విజయవాడలో ఇంటర్, హైదరాబాద్‌లో బీటెక్, ఎంటెక్ చదివించారు. ఆపై ఆయన సింగపూర్‌లోని ట్రాన్స్‌పోర్ట్ లాజిస్టిక్స్‌లో ఉద్యోగం సాధించి స్థిరపడ్డాడు. 'నా కలలు సాకారం చేసేందుకు నాన్న ఎన్నో త్యాగాలు చేసి జీవితంలో బలమైన పునాది వేశారు.. అలాంటి తండ్రి ఉండడం నా అదృష్టం' అని తాబేర్ ఫర్వేజ్ తెలిపారు.

లోక్ అదాలత్‌తో శాశ్వత పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్
- జిల్లా కోర్టుల్లో 6,220 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ అవార్డు అందజేస్తున్న, జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: ఇరుపక్షాలు లోక్ అదాలత్‌లో రాజీ పడడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఇక్కడి తీర్పుపై అప్పీల్‌కు సైతం అవకాశం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ తెలిపారు. ఖమ్మంలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.ఉమాదేవి తదితరులతో కలిసి పాల్గొన్న జిల్లా జడ్జి రాజగోపాల్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని, తద్వారా డబ్బు, సమయం ఆదా అవుతాయని తెలిపారు. పెండింగ్ కేసులు సత్వర పరిష్కారమే కాకుండా ప్రీ లిటిగేషన్, సివిల్ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు ఇతరత్రా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కాగా, లోక్ అదాలత్ ద్వారా 62 మోటార్ వెహికల్ ప్రమాద కేసుల్లో రాజీ ద్వారా రూ.2.80 కోట్ల పరిహారం ఇప్పించామని వెల్లడించారు. జిల్లా కోర్టు పరిధిలోనే కాకుండా సత్తుపల్లి, మధిర కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన వృద్ధురాలు గొడ్ల రత్తమ్మ తరఫున న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ కేసు దాఖలు చేయగా సత్వర పరిష్కారం చేసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.11.50 లక్షల అవార్డ్ జారీ చేశారు. అలాగే, భార్యాభర్తలైన భవాని – వీరభద్రం వివాదాన్ని కూడా రాజీ ద్వారా పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు దేవినేని రామప్రసాదరావు, వి.శీనయ్య, ఎం.అర్చన కుమారి, ఎంకల్పన, టి.మురళీమోహన్, కాసరగడ్డ దీప, బెక్కం రజని, ఏపూరి బిందుప్రియ, వి.మాధవి, బి.నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వెంకటేశ్వరరావుతో పాటు న్యాయవాదులు గద్దల దిలీప్‌కుమార్, బండారుపల్లి గంగాధర్, పి.సంధ్యారాణి, కొత్తపల్లి రామారావు, స్వర్ణ రాంబాబు, మందడపు శీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో కేసుల పరిష్కారం

జిల్లా కోర్టుతో పాటు సత్తుపల్లి, మధిర కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహణకు పలు బెంచ్‌లు ఏర్పాటుచేశారు. ఈమేరకు జిల్లావ్యాప్తంగా రికార్డు స్థాయిలో 6,220 కేసులను పరిష్కరించారు. ప్రమాద బీమా కింద నష్ట పరిహారం కోసం పరిష్కరించిన కేసుల్లో బాధితులకు జిల్లా జడ్జి జి.రాజగోపాల్ లోక్ అదాలత్ అవార్డులు అందజేశారు. ఇంకా క్రిమినల్ కేసులు 2,251, సివిల్ భూతగాదా కేసులు 81, చెక్ బౌన్స్ కేసులు 168, ట్రాఫిక్ చలానా కేసులు 3,549, సైబర్ క్రైమ్ కేసులు 67, కుటుంబ తగాదా కేసులు ఏడు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 12, బీఎస్ఎన్ఎల్ కేసులు 37తో పాటు ఇతరత్రా కేసులను పరిష్కరించారు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/తిరుమలాయపాలెం: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9–30గంటలకు కూసుమంచిలోని క్యాంపు ఆఫీస్‌కు చేరుకోనున్న మంత్రి అక్కడ పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమవుతారు. అనంతరం 4–30గంటల నుంచి తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు, రాజారం, సోలీపురం, కాకరవాయిల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అంతేకాక తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడులో జరిగే 'జై బాపు... జై భీమ్... జై సంవిధాన్' ర్యాలీలోనూ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొననున్నారు.

డిప్యూటీ సీఎం, మంత్రులను కలిసిన కలెక్టర్



డిప్యూటీ సీఎం భట్టికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అనుదీప్

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన దురిశెట్టి అనుదీప్ శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులను కలిశారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన డిప్యూటీ సీఎం, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని మంత్రులు కలెక్టర్‌కు సూచించారు.

రైతు ప్రయోజనాలే అంతిమ లక్ష్యం

- అందుకు అనుగుణంగా విత్తన చట్టం రూపకల్పన
- రాష్ట్ర విత్తనాభివద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ అన్వేష్‌రెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకుండా వారి సంపూర్ణ ప్రయోజనాల కోసం విత్తన చట్టం రూపొందిస్తున్నట్లు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. చట్టం ముసాయిదా బిల్లుపై కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి జిల్లా వ్యవసాయాధికారులు, ఆదర్శ రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొనగా అన్వేష్‌రెడ్డి మాట్లాడారు. నకిలీ విత్తనాల కారణంగా రైతులు నష్టపోతున్నందున పకడ్బందీ చట్టాలు చేసేందుకు విత్తన చట్టం ముసాయిదా బిల్లు రూపొందించామని తెలిపారు. దీనిపై అభిప్రాయాల సేకరణ కోసం ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఈ సమావేశాల్లో వచ్చే సూచనల ఆధారంగా మార్పులు, చేర్పులు చేసి చట్టం ఖరారు చేస్తామని అన్వేష్‌రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

ఫిర్యాదు చేయొచ్చు....

రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు ఆర్.గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రైతులు సొంతంగా విత్తనం ఉత్పత్తి చేసుకునేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో మోసపోతున్నారని తెలిపారు. ఎవరికైనా నష్టం ఎదురైతే రైతు సంక్షేమ కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. న్యాయవాది సునీల్ మాట్లాడుతూ ఒప్పందం పేరిట వ్యవసాయం జరుగుతున్నందున విత్తన నాణ్యతలో లోపాలతో రైతుకు నష్టం ఎదురైతే పరిహారం పొందే విధానం ఉండాలన్నారు. రఘునాథపాలెంకు చెందిన రైతు రఘురాం మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలే అమ్మేలా చూస్తే నష్టపోయే పరిస్థితి ఉండదన్నారు. వైరాకు చెందిన బి.రాంబాబు, భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు మాట్లాడగా, కొణిజర్ల ఏఓ నాగార్జున మాట్లాడుతూ విత్తన లోపాలతో నష్టపోయే రైతులకు పరిహారం అందేలా చట్టంలో పొందుపర్చాలని తెలిపారు. ఖమ్మం డీలర్ల అసోసియేషన్ ప్రతినిధి మనోహర్ మాట్లాడుతూ లైసెన్స్‌డ్ కంపెనీల నుంచే విత్తనాలు తెచ్చి అమ్ముతుండగా, పంట సరిగ్గా రాకపోతే డీలర్ల తప్పేం ఉంటుందని ప్రశ్నించారు. ఈమేరకు లైసెన్సింగ్ విధానంలోనే మార్పులు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీన, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల వ్యవసాయాధికారులు డి.పుల్లయ్య, వి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ బస్సుల్లో అన్నవరం, వాడపల్లి, భద్రాచలం, కిన్నెరసాని వెళ్లివచ్చేలా టూర్ ప్యాకేజీ అమల్లోకి తీసుకొచ్చినట్లు ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 27న ఉదయం 8గంటలకు డీలక్స్ బస్సు బయలుదేరనుండగా, అన్నవరం, వాడపల్లి ఆలయాల్లో దర్శనం ఉంటుందన్నారు. ఆతర్వాత 28న ఉదయం భద్రాచలం చేరుకుని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ దర్శనం, కిన్నెరసాని ప్రాజెక్టు సందర్శనకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. అక్కడి నుంచి సాయంత్రంకల్లా బస్సు ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. డీలక్స్ బస్సులో ఒక్కొక్కరికి రూ.1,200 చార్జి నిర్ణయించగా, 88666 సర్వీస్ నంబర్‌తో రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని డీఎం వెల్లడించారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూవిరాట్‌కు అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అలాగే, స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించాక పల్లకీ సేవ నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్నామలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్



అధ్యాపకుడిని అభినందిస్తున్న చైర్మన్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మద్దినేని వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. అన్నామలై యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఆయన 'డైనమిక్ రిసోర్స్ అలకేషన్ అండ్ లోడ్ బ్యాలెన్సింగ్ ఇన్ క్లౌడ్ ఎన్విరాన్‌మెంట్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపాళ్లు డాక్టర్ బి.గోపాల్, వి.రామారావు, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, అధ్యాపకులు ఇంజం నరసింహారావు, ఎం.శివకుమార్ అభినందించారు.

పెరిగిన పెంకు కార్మికుల వేతనాలు

ఇల్లెందురూరల్: పెంకు పరిశ్రమల యజమానులు, తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధుల మధ్య చర్చలు ఫలప్రదం కావడంతో మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కార్మికుల వేతనాలు పెరిగాయి. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సమక్షంలో ఇరువురు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం.. కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి గత రేట్లపై అదనంగా లోన పనులకు 4శాతం, బయట పనులకు 5శాతం, రోజువారీ కూలీ రేట్లపై అదనంగా రూ.10, గుమస్తాలకు ప్రస్తుత వేతనాలపై అదనంగా నెలకు రూ.400 చొప్పున పెరిగాయి. ఈ ఒప్పందం 2026 జూన్ వరకు కొనసాగేలా ఒప్పందం కుదిరింది. చర్చల్లో తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాంసింగ్, దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ, రంగబాబు, సత్తిబాబు, యజమానులు సాంబశివరావు, అరవింద్, విక్రమ్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ శ్రేణులకే ఇందిరమ్మ ఇళ్లు'



మొక్క నాటుతున్న కోటేశ్వరరావు, నాయకులు

నేలకొండపల్లి: రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారడమే కాక స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ధైర్యం చాలడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడుతూ ఇందిరమ్మ ఇళ్లను ఆ పార్టీ శ్రేణులకే ఇస్తున్నారని ఆరోపించారు. అంతేకాక ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారని పేర్కొన్నారు. కాగా, 11ఏళ్ల పాటు దేశంలో మోదీ సుస్థిర పాలన అందించారని తెలిపారు. అనంతరం నేలకొండపల్లిలో ఆయన మొక్కలు నాటడంతో పాటు కేంద్రప్రభుత్వ పథకాలతో రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటి హనుమంతరావు, పాగర్తి సుధాకర్, షర్ఫొద్దీన్, మన్నె కృష్ణారావు, భువనాసి దుర్గాప్రసాద్, గోవిందరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, కందరబోయిన వెంకటరమణ, తంగెళ్ల సతీష్, కొండా హర్ష తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన లారీ



లారీ డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

కామేపల్లి: ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటన కామేపల్లి మండలం మద్రిగూడెం స్టేజీ సమీపాన శనివారం చోటుచేసుకుంది. ఖమ్మం నుంచి ఇల్లెందుకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సుమారు 50 మంది ప్రయాణికులతో వెళ్తుండగా మద్రిగూడెం స్టేజీ వద్ద ఇల్లెందు వైపు నుంచి వస్తున్న యాష్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ, లారీ ముందు భాగాలు నుజ్జునుజ్జయి డ్రైవర్లు తోటా పృథ్వీ, బి.సాయితో పాటు బస్సులో ఉన్న సముద్రాల లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే, మరో పది మంది ప్రయాణికులు గాయపడ్డారు. అయితే, లారీ క్యాబిన్‌లో డ్రైవర్ సాయి ఇరుక్కుపోగా స్థానికులు ట్రాక్టర్ల సాయంతో ఆయనను బయటకు తీశారు. ఈ ఘటనతో ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోగా కామేపల్లి ఎస్సై సాయికుమార్ చేరుకుని వాహనాలను పక్కకు తప్పించి రాకపోకలు క్రమబద్ధీకరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

'నీట్'లో జిల్లా విద్యార్థుల సత్తా

మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్‌లో జిల్లా విద్యార్థులు పలువురు సత్తా చాటారు. జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ పూర్తిచేశాక నీట్ రాయగా, జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు అభినందించాక వివరాలు వెల్లడించాయి. – ఖమ్మం సహకారనగర్

న్యూవిజన్‌కు అత్యుత్తమ ర్యాంక్‌లు



విద్యార్థులతో చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్, డైరెక్టర్ కార్తీక్

ఖమ్మం సహకారనగర్: జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ తెలిపారు. ఈమేరకు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించాక మాట్లాడారు. పి.సంహిత 951వ ర్యాంక్ సాధించగా, ఎల్.సాయిచరణ్ 1,114, బి.గోపీచంద్ 1,187, ఎం.ఆకాంక్ష 1,197, ఎం.వైష్ణవి 1,535, బి.సాయిశ్రుతి 2,571, టి.దివ్య 2,991, బి.చైతన్య సాయి 3,058, బి.అక్షిత 4,281, ఆర్.శీతల్ 5,553, జె.వివేక్ 5,672, బి.యశ్వంత్ 5,743వ ర్యాంక్‌లు సాధించారని తెలిపారు. అలాగే, ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్ తదితర జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లోనూ తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సీహెచ్.గోపీచంద్, సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హార్వెస్ట్‌కు ఉన్నత శ్రేణి ఫలితాలు



నయనాంజలి, ఉమాఅలేఖ్య, భార్గవి

ఎన్‌టీఏ ఆధ్వర్యాన నిర్వహించిన నీట్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని హార్వెస్ట్ గ్రూప్ విద్యాసంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. కళాశాల విద్యార్థిని తమన్నా డీవీఎస్ఎస్.నయనాంజలి 564 మార్కులతో 3,321, జి.రాణి ఉమాఅలేఖ్య 544 మార్కులతో 6,586వ ర్యాంకు, బి.భార్గవి 449 మార్కులతో 1,181వ ర్యాంకు సాధించగా, జి.శ్రీమయి 456 మార్కులతో 6,727, ఎండీ.అన్షియ ముస్కాన్ 487 మార్కులతో 8,420, సరోజ్ రాజ్ పురోహిత్ 472 మార్కులతో 40,997, ఎం.డీ.షయాన్ మునీబ్ 433 మార్కులతో 77,202, ఎస్.జాహ్నవి 377మార్కులతో 2,55,757వ ర్యాంకు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి విద్యార్థులను అభినందించారు.

డాక్టర్స్ అకాడమీ ర్యాంకుల పంట



విజయచిహ్నం చూపుతున్న యాజమాన్యం, విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నీట్ ఫలితాల్లో ఖమ్మంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థిని తూము వెన్నెల 626 మార్కులతో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 307వ ర్యాంకు సాధించిందని యాజమాన్యం రాయల సతీష్‌బాబు, ఈగా భరణికుమార్ తెలిపారు. అలాగే, వెన్నెల రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. ద్వితీయస్థానంలో రిషిక శర్మ 588, ప్రియాంక ఎస్టీ కేటగిరీలో ఆలిండియా 171వ ర్యాంకు సాధించిందని వివరించారు. ఇంకా అతియా తరణమ్ 509, ఏ.వర్ష 505, కె.మోక్షిత శరణ్యయ 496, షేక్ సమీన మధార్ 496, రేణుశ్రీ 489, యశ్వంత్ 482, ఆయేషా సమీర 481, సీహెచ్.క్షేత్ర 474, వెన్నెలరెడ్డి 467, కే.వీ.నిక్షిత 463 మార్కులు సాధించారని, నర్కులు సాధించినట్లు తెలిపారు. ఇక జి.అనూష 461, షేక్ నూరెవసీమ్ 467, టి.వైష్ణవి 451, ఎండి.సునైనా 450, ఎస్.విగ్నేష్‌రెడ్డి 444, బి.అక్షయ 443 ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా ర్యాంకర్లను ఘనంగా సన్మానించారు. 500 మార్కులకు పైన ఆరుగురు, 450 మార్కులకు పైన 21మంది, 400 మార్కులకుపైన 62మంది, 122 మందికి ప్రభుత్వ ఎంబీబీఎస్‌సీట్లు సాధిస్తున్న ఏకైక సంస్థ తమదేనన్నారు.

సర్జన్‌గా సేవలందిస్తా...



భవిష్యత్‌లో మంచి సర్జన్‌గా పేదలకు సేవ చేయాలనేది నా లక్ష్యం. నీట్‌లో 626 మార్కులతో ఆలిండియా స్థాయిలో 307వ ర్యాంక్ సాధించా. డాక్టర్స్ మెడికల్ అకాడమీ యజమాన్యం రాయల సతీష్‌బాబు, భరణికుమార్ సలహాలు, సూచనలతో ఇది సాధ్యమైంది. మా అమ్మ నవ్య గృహిణి కాగా, నాన్న తూము రామకృష్ణ న్యూలైఫ్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు.

– తూము వెన్నెల, 307వ ర్యాంకు, డాక్టర్స్ మెడికల్ అకాడమీ

కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కృష్ణవేణి డైరెక్టర్లు గొల్లపుడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. సీహెచ్.రాగ్ని 556మార్కులు, బి.నందిని 505, జి.కావ్య 479, వై.గీతికాశ్రీ 479,జి.అశ్విన్ 467, వి.అనిల్‌కుమార్ 456, బి.చార్మి 449, ఎస్.గీతశ్రీ 447, జి.హారిణి 441, ఎస్.మాధవన్ 434, సిహెచ్.షేభారాణి 430, ఎస్.దివ్య శ్రీ 424, ఆర్.దుర్గ మహేష్ 418, కె.నిస్సీ అమూల్య 418, బి.వినీత 414, ఎం.హాసిని 413, కె.నవ్య 408, జి.జనని 406, పి.దేవా సుమ హర్షిణి 403, ఎస్.రిషిత 402మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థులను వారు అభినందించారు.

రెజొనెన్స్ ప్రభంజనం



విద్యార్థులతో డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అభినందించాక వారు మాట్లాడారు. వైఎస్. రెడ్డి 460వ మార్కులు, ఎస్.రామ్‌చరణ్ 460, ఎస్.మాల్యాద్రి 444, ఎస్. లావణ్య 442, ఎస్.కే.బీణా 407, ఎస్. అజయ్‌కుమార్ 372, బి.హరికృష్ణ 330, జి.లావణ్య 325, బి.సిరిచందన 300 మార్కులు సాధించారన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల సత్తా..



విద్యార్థులతో డైరెక్టర్ శ్రీవిద్య, తదితరులు

నీట్ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థులు పలువురు జాతీయ స్థాయిలో 267, 541తో వెయ్యి లోపు ర్యాంకులు సాధించారని తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. అంతేకాక తమ విద్యార్థులకు 1,229, 2801, 3,104, 3,255, 3,658, 4,175, 4,445, 4481వంటి అత్యుత్తమ ర్యాంకులు వచ్చాయని పేర్కొన్నారు కాగా, డి.దుర్గా గుజిరి 267, ఎల్.మనోహర్ 541, బి.చందన 1,229, వి.రోహి/ త 2,810, భూమిక 3,104, జి.శ్రీనిధి జ్యోతిర్మయి 3,255, డి.శ్రీలేఖ 3,658, డి.జ్వరాజ్‌పాల్ 4,175, ఎ.లిఖిత 4,445, వి.ప్రియాంక 4,481, బి.రిషిత 5,898 ర్యాంకులు సాధించారని వెల్లడించగా వారిని అభినందించారు.

ఎమ్మెల్సీ గారూ.. ఏంటీ తీరు ?

శ్రీపాల్‌రెడ్డి వైఖరిపై పీఆర్‌టీయూ నిరసన

పాల్వంచ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి తీరు పట్ల పీఆర్‌టీయూ నాయకులు నిరసన తెలిపారు. పాల్వంచలోని టీటీడీ కల్యాణ మండపలంలో శనివారం పీఆర్‌టీయూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో శ్రీపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా పనిచేశారనే ఆరోపణలతో పీఆర్‌టీయూ ముఖ్య నాయకులు డి.వెంకటేశ్వరరావు, సంగమేశ్వరరావు, హీరాలాల్, ఎం.వెంకటేశ్వరరావును యూనియన్ నుంచి సస్పెండ్‌చేశారు. దీనిపై శనివారం సమావేశంలో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తనుకు వ్యతిరేకంగా పనిచేయడం సరికాదన్నారు. దీంతో నాయకులు మూకుమ్మడిగా నిరసన తెలిపారు. తప్పుడు సమాచారంతో వారిని సస్పెండ్ చేశారని, వ్యతిరేకంగా పనిచేస్తే ఎలా గెలిచారని ఆయనను నిలదీశారు. సస్పెన్షన్ విషయంలో రాష్ట్ర కమిటీ వైఖరి సరికాదని అనడంతో శ్రీపాల్‌రెడ్డి అసహనం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం పీఆర్‌టీయూ నాయకులు ధర్మ దీక్ష నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులుగా డి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బి.రవి ప్రమాణం చేశారు. నాయకులు సంగమేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, రఘు, పుల్లయ్య, హీరాలాల్ పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్సీ

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలకగా, ప్రదక్షిణ అనంతరం మూల మూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీ తాయారమ్మవారి సన్నిధిలో పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి విరాళం..



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన చిన్నబాబు – పుష్పాంజలి దంపతులు శనివారం రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆలయ పీఆర్వో సాయిబాబు తదతరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మందుల లభ్యతపై ఆరా తీస్తున్న రవీందర్

బూర్గంపాడు: ప్రజారోగ్యంపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. ఫార్మసీ గదిని తనిఖీ చేసి మందులను పరిశీలించారు. పేషెంట్లతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం ఆసన్నమైనందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులను నూరు శాతం నమోదు చేసి వారికి రక్తహీనత లేకుండా మందులు అందించాలని, ఆస్పత్రి ప్రసవాలను ప్రోత్సహించేందుకు వారికి ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమాచారం తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్లు తగ్గించి సాధారణ ప్రసవాలను పెంచేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంత గర్భిణులను గుర్తించి వారి డెలివరీ సమయానికి ముందే ముందే ఆస్పత్రిలో చేర్పించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్ జయలక్ష్మి, డాక్టర్ ఆర్.చైతన్య, ప్రసాద్, మధువరన్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలోకి దూసుకెళ్లిన లారీ



ఆలయంలోకి దూసుకెళ్లి బోల్తా పడిన లారీ

పెనుబల్లి: ఓ లారీ అదుపు తప్పి మండలంలోని లంకపల్లిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న రామాలయంలోకి దూసుకెళ్లిన ఘటన శనివారం రాత్రి జరిగింది. సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి ఆలయంలో దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో రామాలయం దెబ్బతినగా, లారీ డ్రైవర్ శ్యామ్‌సింగ్, క్లీనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. దీంతో పోలీసులు చేరుకుని లారీ క్యాబిన్‌లో వారిద్దరిని బయటకు తీసి 108లో పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాద సమయంలో ఆలయంలో నిద్రిస్తున్న దివ్యాంగుడైన ఓ వ్యక్తికి సైతం గాయాలయ్యాయని ఎస్సై కె. వెంకటేష్ తెలిపారు.

ప్రేమికుల అరెస్ట్..

వర్ధన్నపేట: చైన్‌స్నాచింగ్ కేసులో ప్రేమికులను వరంగల్ జిల్లా వర్ధన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంకు చెందిన రామాయణం హేమలత వర్ధన్నపేట మండలం నల్లబెల్లిలోని తన అమ్మమ్మ ఇంటికి ఇటీవల వచ్చింది. ఎదురింట్లో నివాసముండే పెరంబుదూరు సజాత మెడలో బంగారు గొలుసు ఉండగా, చోరీకి నిర్ణయించుకున్న ఆమె తన ప్రియుడైన పిడియాల రాముకు సమాచారం ఇచ్చింది. ఈనెల 11న రాత్రి ఆయన ఊరి చివరి వేచి ఉండగా, హేమలత ఇంటి బయటకు వచ్చిన సుజాత మెడలో నుంచి బంగారు గొలుసును తెంపుకుని పరుగెత్తి ప్రియుడితో కలిసి బైక్‌పై ఖమ్మం పారిపోయింది. శనివారం ఖమ్మం నుంచి వరంగల్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. ఈమేరకు పోలీసులు వారిని పట్టుకుని విచారించగా 24 గ్రాముల బంగారు మంగళసూత్రం చోరీ విషయాన్ని ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్సై రాజు, కానిస్టేబుళ్లు సురేశ్, రంజిత్, కల్పన, సానియా పర్వాన్, స్వాతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



షేక్ మోహిన్ (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని ఏలువారిగూడెం స్టేజీ సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని బీరోలుకు చెందిన ఎస్.కే.మహ్మద్ కుమారుడు మోహిన్(24) తన స్నేహితుడు ఎస్.కే.జాకీర్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై దమ్మాయిగూడెం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమాన ఏలువారిగూడెం మూలమలుపు వద్ద తాటి చెట్టుకు తగిలి పడిపోయారు. ఈ ఘటనలో మోహిన్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, జాకీర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం తరలించారు. మోహిన్ హైదరాబాద్‌లోని హోటల్‌లో పనిచేస్తూ మూడు రోజుల క్రితమే ఇంటికి వచ్చి ప్రమాదం బారిన పడడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కామేపల్లి: మండలం పరిధిలోని పింజరమడుగు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేలోత్ భాస్కర్‌నాయక్ వాహనం చోరీకి గురైంది. ఆయన శుక్రవారం పంట చేను వద్ద బుల్లెట్ బైక్ నిలిపి, దుక్కి దున్ని వచ్చేసరికి వాహనం కానరాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, బైక్ కవర్‌లో సుమారు రూ.60 వేల నగదు కూడా ఉందని భాస్కర్ తెలిపారు.

స్తంభం.. వాడితే పన్ను ఖాయం

- ఇన్నాళ్ల మాదిరి దాటవేయడం కష్టమే
- పక్కాగా లెక్క తేల్చేలా జాయింట్ సర్వే



నేలకొండపల్లిలోని ఓ స్తంభానికి టీవీ, ఇంటర్నెట్ వైర్లు

నేలకొండపల్లి: విద్యుత్ స్తంభాలను వినియోగించుకుంటున్న కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్ల నుంచి కచ్చితంగా పన్ను వసూలు చేసేలా విద్యుత్ శాఖ సిద్ధమవుతోంది. గతంలోనూ ఈ పన్ను విధానం అమల్లో ఉన్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. అలాగే, స్తంభాలకు గజిబిజిగా వైర్లు ఉండడంతో ఏదైనా మరమ్మతు అవసరమైనప్పుడు సిబ్బంది ఎక్కడం కష్టమవుతోంది. వీటన్నింటికి చెక్ పెట్టేలా విద్యుత్ శాఖ అధికారులు ప్రతీ స్తంభాన్ని పరిశీలించి వినియోగించుకున్న వారి పన్ను వసూలుకు నిర్ణయించింది.

వాడితే పన్ను కట్టాల్సిందే..

జిల్లాలో విద్యుత్ స్తంభాలను వినియోగించే వారంతా పన్ను చెల్లించాల్సిందే. తొలుత గజిబిజిగా ఉన్న ఇంటర్నెట్, కేబుల్ టీవీ వైర్లను సరి చేసుకోవాలని సూచించారు. ఆతర్వాత వారు వినియోగించుకుంటున్న స్తంభాల లెక్క తేల్చేందుకు జాయింట్ సర్వే చేస్తున్నాం. ఆపై ప్రతీ నెల పన్ను వసూలు చేస్తాం.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్‌ఈ

సంయుక్తంగా సర్వేకు శ్రీకారం



రాయిగూడెంలో సర్వే చేస్తున్న సిబ్బంది

ప్రైవేట్ వ్యక్తులు విద్యుత్ స్తంభం వినియోగించుకుంటే గ్రామాల్లోనైతే రూ.15, పట్టణాల్లో రూ.20 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానం చాన్నాళ్లుగా అమల్లో ఉంది. కానీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం లేదు. ఈ నేపథ్యాన జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో టీవీ, ఇంటర్‌నెట్ ఆపరేటర్లు ఎన్నేసి స్తంభాలను వినియోగించుకుంటున్నారో లెక్క తేల్చాలని నిర్ణయించారు. ఈమేరకు విద్యుత్ సిబ్బంది, ఆపరేటర్లు సంయుక్తంగా సర్వే చేస్తున్నారు. వారం, పది రోజులలో ఈ ప్రక్రియ పూర్తయ్యాక పన్నుల వసూళ్లకు రంగంలోకి దిగనున్నారు.

స్తంభాలపై కుప్పలు కుప్పలుగా

పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు వైర్లు కుప్పలుగా ఉంటున్నాయి. కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్ కేబుళ్లతో పాటు విద్యుత్ తీగలు అన్ని కలిసిపోయి ఉంటాయి. ఈమేరకు ఆపరేటర్లు పదిహేను రోజుల్లోగా వైర్లను సర్దుకోవాలని అధికారులు సూచించారు. ఆతర్వాత లెక్కలు తేల్చి పన్ను వసూలుకు నిర్ణయించారు.

క్లుప్తంగా

సింగరేణి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్



గౌతమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ డైరెక్టర్ (పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ - (పా)గా గౌతమ్ పొట్రు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఆయనను సింగరేణి డైరెక్టర్‌గా కేటాయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో సీఎండీ ఎన్.బలరామ్ సమక్షాన బాధ్యలను స్వీకరించారు. ప్రస్తుతం డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు ఈ బాధ్యతలను అదనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గౌతమ్‌కు సీఎండీతో పాటు డైరెక్టర్లు, జీఎంలు శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం శిబిరంలో డీఎంహెచ్‌ఓ, తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం: రక్తదానం చేయడం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడినట్లవుతుందని ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఖమ్మంలోని జోయా అలుక్కాస్ బ్రాంచ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యవంతులైన ప్రతీఒక్కరు రక్తదానం చేయొచ్చని, తద్వారా అవసరమైన వారికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ఖమ్మం జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్, పీఓ డాక్టర్ రామరావు, డాక్టర్ సృజన, శర్మిలతో పాటు ఎస్.రామకృష్ణ, ఎం.డీ.మహ్మూద్ అలీ, దినేష్, రహీం, జాయ్ అలుక్కాస్ బ్రాంచ్ మేనేజర్ అనూప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

17 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లపై అభ్యంతరాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లా కేంద్రానికి ఆనుకుని మల్లెమడుగు రెవెన్యూ పరిధి పట్టా భూముల్లో వేసిన వెంచర్లలో 17 ఏళ్ల కిందట తాము ప్లాట్లను కొనుగోలు చేయగా.. ఇప్పుడు పలువురు గందరగోళం సృష్టిస్తున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లకు సంబంధించి వారి వద్ద పత్రాలు ఉన్నాయని చదును చేశారంటూ ఇటీవల ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, తాము కొనుగోలు చేసిన సమయాన పత్రాలన్నీ సరిగ్గా ఉన్నాయన్న అమ్మకందారుల మాటలు నమ్మి 2008లో 138 మంది రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నామని తెలిపారు. కానీ ఇటీవల కొందరు రాత్రి వేళ హద్దురాళ్లు తొలగించి భూమి చదును చేయించారని ఆరోపించారు. ఇప్పటికే కొందరు ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకుని ఇంటి నిర్మాణాలకు అనుమతులు కూడా తీసుకున్నారని తెలిపారు. సమస్యపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరారు.

జర్నలిజంలో విస్తృత అవకాశాలు



కేయూ క్యాంపస్: జర్నలిజం కోర్సు పూర్తిచేసిన వారికి మీడియా రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ తెలిపారు. జర్నలిజం కోర్సు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం కేయూలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సమాజంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతోపాటుగా సామాజిక మాధ్యమాల విస్తృతి మూలంగా ప్రపంచంలో ఏ ఘటన జరిగినా క్షణాల్లో అన్నివర్గాల ప్రజలకు చేరుతోందని చెప్పారు. అయితే, అవకాశాలను అందిపుచ్చుకోవడానికి జర్నలిజం విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు కాలంతో పోటీపడే తత్వం అవసరమని చెప్పారు. ఈసమావేశంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు కె.నర్సింహరాములు, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ సుధాకర్, పి.వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి పాల్గొన్నారు. తొలుత ఇటీవల అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అన్నదాతకు మరింత చేయూత

- పంటలకు రుణ పరిమితి పెంచుతూ నిర్ణయం
- అనుబంధ రంగాలకు సైతం రుణాల పెంపు
- ఎస్‌ఎల్‌టీసీ సిఫారసులతో 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్'ఖరారు
- ఆపై డీఎల్‌టీసీల్లో సమీక్ష, నిర్ణయాలు



నిర్ణయించిన రుణపరిమితి (ఎకరాకు రూ.ల్లో)
(కొన్ని ప్రధాన పంటల వివరాలు)

పంట	గత ఏడాది	ఈ ఏడాది
వరి (ఇరిగేషన్)	43,000-45,000	44,000-46,000
మొక్కజొన్న	32,000-34,000	34,000-36,000
కంది	22,000-24,000	23,000-25,000
పెసలు	20,000-22,000	20,000-22,000
వేరుశనగ	28,000-30,000	30,000-32,000
పత్తి (వర్షాధారం)	44,000-46,000	46,000-48,000
చెరుకు (ప్లాంటేషన్)	78,000-80,000	80,000-82,000
ఆయిల్ పామ్	42,000-44,000	46,000-48,000
మిర్చి	82,000-84,000	84,000-86,000
టమాట (మల్చింగ్)	68,000-70,000	70,000-72,000
మునగ	33,000-35,000	34,000-36,000
కూరగాయలు	35,000-37,000	35,000-37,000
బొప్పాయి	65,000-67,000	67,000-69,000
మామిడి	42,000-44,000	45,000-47,000
మల్లె	38,000-40,000	42000-44,000
గులాబీ	50,000-52,000	52,000-54,000
పశుసంపద		
గొర్రెలు (20+1)	22,000-24,000	26,000-28,000
మేకలు (20+1)	24,000-26,000	27,000-29,000
గేదె	31,000-33,000	33,000-35,000
ఆవు	31,000-33,000	33,000-35,000

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగుతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రస్తుత పరిస్థితుల్లో అయ్యే పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుని రుణపరిమితి పెంచారు. ఇటీవల జరిగిన ఎస్‌ఎల్‌టీసీ (స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ) సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను స్థిరీకరించారు. జిల్లాల వారీగా పంటల సాగు, అందుకయ్యే పెట్టుబడులు, ఉత్పత్తుల విలువ, భౌగోళిక పరిస్థితులను ఎస్‌ఎల్‌టీసీ అధ్యయనం చేశాక ఈ ఏడాదికి అందించే రుణాలను ఖరారు చేశారు. ఈ మేరకు గత ఏడాదితో పోలిస్తే పంటల సాగు, అనుబంధ రంగాల్లో రైతులకు ఇచ్చే రుణాలు పెరగనున్నాయి.

అన్ని కోణాల్లో చర్చించాక..

టీజీ కాబ్ (తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్) మేనేజింగ్ డైరెక్టర్ కన్వీనర్‌గా, నాబార్డ్, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు, బ్యాంకర్లు, విశ్వవిద్యాలయాల అధిపతులు ఎస్‌ఎల్‌టీసీలో సభ్యులుగా ఉంటారు. ఇటీవల జరిగిన కమిటీ సమావేశంలో ఈ ఏడాదికి సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌పై భిన్నకోణాల్లో చర్చించాక పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఎస్‌ఎల్‌టీసీ తీసుకున్న నిర్ణయాన్ని జిల్లాల వారీగా స్థానిక పరిస్థితుల ఆధారంగా డీఎల్‌టీసీ (డిస్ట్రిక్ట్ లెవల్ టెక్నికల్ కమిటీ)లు అమలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఎస్‌ఎల్‌టీసీ భేటీ సందర్భంగా రాష్ట్రంలో సాగుచేసే 122రకాల పంటలకే కాక పశు, మత్స్య సంపదకు ఇచ్చే రుణాలను గత ఏడాదితో పోలిస్తే పెంచుతూ ఈ ఏడాదికి స్థిరీకరించారు. తద్వారా వ్యవసాయ పంటల సాగుకు ఇచ్చే రుణాలు ఎకరాకు రూ.2 వేల వరకు, ఉద్యాన పంటలకు రూ.4వేల వరకు పెరిగాయి. అలాగే, పశు సంపద, మత్స్య సంపద వనరులకు కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచారు.

ఏటేటా మార్పులు

వివిధ విభాగాలతో కూడిన రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ వ్యవసాయ, అనుబంధ శాఖల పరిధిలో ఉత్పత్తులకు గాను ఇటీవల నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తుంది. గత ఏడాదితో పోలిస్తే రుణపరిమితి పెరగగా.. మళ్లీ వచ్చే ఏడాది పంటల కాలానికి ముందు కమిటీ సమావేశమై అప్పటి పరిస్థితులు, వ్యయం, దిగుబడి ఆధారంగా రుణాలను సవరిస్తుంది. పంటలకు నీటి పారుదల, వర్షాధారంగా రుణాలను నిర్ణయించగా.. పశు సంపద, మత్స్య సంపదకు సైతం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను స్థిరీకరించారు.

అమలు దిశగా డీఎల్‌టీసీ చర్యలు

ఎస్‌ఎల్‌టీసీ స్థిరీకరించి జారీ చేసిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను జిల్లాస్థాయి కమిటీలు అమలు చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా జిల్లా కమిటీ బాధ్యులు ప్రభుత్వ శాఖలు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి ఎస్‌ఎల్‌టీసీ మార్గదర్శకాల అమలుకు సమాయత్తమవుతోంది. డిస్ట్రిక్ కమిటీలకు కలెక్టర్ చైర్మన్‌గా, లీడ్ బ్యాంక్ మేనేజర్ కన్వీనర్‌గా ఉంటారు. ఈ కమిటీ వానాకాలం, యాసంగి సీజన్లకు ఇచ్చే రుణాలను ఖరారు చేస్తుంది. ఈ క్రమంలో జిల్లాల్లో పంటల సాగు విస్తీర్ణం, పశు సంపద తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని సీజన్ల వారీగా రుణ కేటాయింపులను నిర్ణయిస్తుంది.

395 అడుగులకు చేరిన 'కిన్నెరసాని'

నిత్యం 100 క్యూసెక్కులకు పైగా నీరు బయటకు..



కిన్నెరసాని జలాశయం



నీటిమట్టం సూచిక

పాల్వంచరూరల్ : కిన్నెరసాని జలాశయం నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లో గత వానాకాలంలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. కాగా, శనివారం నాటికి 395.60 అడుగులకు తగ్గిందని డ్యామ్‌సైడ్ ఇంజనీర్ తెలిపారు. రిజర్వాయర్ నుంచి ప్రతి రోజు 100 క్యూసెక్కులకు పైగా నీరు బయటకు వెళుతోంది. ఇందులో కేటీపీఎస్ కర్మాగారానికి 75 నుంచి 80 క్యూసెక్కులు, కొత్తగూడెం మున్సిపాలిటీకి 15 క్యూసెక్కులు, నవభారత్ కర్మాగారానికి నాలుగు క్యూసెక్కులు, ఎన్ఎండీసీకి ఒక క్యూసెక్, పాల్వంచ మున్సిపాలిటీకి 6.34 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నామని సంబంధిత అధికారి వివరించారు.

ఖమ్మం స్టేషన్‌కు మరిన్ని హంగులు



స్టేషన్‌లో సిద్ధమవుతున్న బ్రిడ్జి

- ఇప్పటికే చకచకా అభివృద్ధి పనులు
- తాజాగా మరో రూ.25 కోట్లు మంజూరు

ఖమ్మం రాపర్తినగర్: కాజీపేట – విజయవాడ మార్గంలోని ప్రధానమైన ఖమ్మం రైల్వేస్టేషన్ మరిన్ని హంగులు సంతరించుకోనుంది. ఇప్పటికే అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.25.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. వీటికి తోడు తాజాగా రూ.25కోట్లు మంజూరు చేయడం విశేషం. ఈ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టే వీలు ఏర్పడనుంది. కాగా, గతంలో మంజూరైన నిధులతో విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్ ఏర్పాటు, ప్లాట్ ఫామ్‌ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. ఈ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు వేగంగా చేపడుతున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వృద్ధులు, దివ్యాంగులు వీల్‌చైర్లలో వెళ్లే వెసలుబాటు ఏర్పడుతుంది.

నూతన భవనానికి..

ఇప్పటికే మంజూరైన నిధులకు తోడు తాజాగా రూ.25కోట్లను కేంద్ర రైల్వేశాఖ మంజూరు చేసింది. ఈ నిధులతో రైల్వే స్టేషన్‌లో మరిన్ని ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. ప్రధానంగా ఖమ్మం రైల్వే స్టేషన్‌కు నూతన భవనం నిర్మిస్తారు. అలాగే ఇతర పనులు చేపట్టనుండడంతో స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు కొత్త అనుభూతి కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

మేడారం వెళ్లొస్తుండగా ప్రమాదం

- చిరునోముల గ్రామస్తులకు గాయాలు

బోనకల్: మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన పలువురు ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క–సారలమ్మ దర్శనానికి వెళ్లివస్తుండగా జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఏటా మామిడికాయలు కోసే కూలీలు పనులు పూర్తి కావడంతో మొక్కు చెల్లించుకునేందుకు మేడారంలో సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్దకు శుక్రవారం వెళ్లారు. టాటా ఏస్ వాహనంలో వెళ్లిన వారు పూజల అనంతరం శనివారం తిరిగి బయలుదేరారు. మేడారం నుంచి 10 కిలోమీటర్ల దూరం వచ్చాక వర్షం కురుస్తుండడంతో వాహనం ప్రమాదవశాత్తు రోడ్డు దిగడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో 18 మందికి గాయాలు కాగా, ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో తెల్లబోయిన బుజ్జి, పోతనబోయిన బాను, బల్లి యశ్వంత్, భరత్‌కు తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఆరో తరగతి బాలికపై అత్యాచారం

కారేపల్లి: ఆరో తరగతి చదువుతున్న బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామానికి 11 ఏళ్ల బాలికను అదే గ్రామానికి భూక్యా హరి ఓ శుభకార్యంలో కలిశాడు. అప్పట్లో ఆమెను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేయగా నిరాకరించింది. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి బాలిక కిరాణా షాపునకు వెళ్లగా వెంబడించిన యువకుడు తన బైక్‌పై బలవంతంగా ఎక్కించుకుని సమీపంలోని చేను వద్దకు తీసువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలు వేస్తుండడంతో సమీపంలోని ఓ రైతు వెంబడించడంతో యువకుడు పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గోపి తెలిపారు.

ఐఐటీకి గిరిజన విద్యార్థి

తిరుమలాయపాలెం: చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించాడు తిరుమలాయపాలెం మండలంలోని చంద్రుతండాకు చెందిన గిరిజన విద్యార్థి. తండాకు చెందిన బానోతు వీరన్న – అనిత దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరన్న ఆటోడ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తుండగా కుమార్తె పల్లవి ట్రిపుల్ ఐటీలో చదువుతోంది. ఇక కుమారుడు హరిచంద్ర దమ్మపేట ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ఇంటర్ పూర్తిచేసి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎస్టీ కేటగిరీ నుంచి 1,246ర్యాంకు సాధించాడు. ఆపై తొలి రౌండ్‌లోనే ఐఐటీ రూర్కెలాలో కెమికల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించగా పలువురు అభినందించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ పచ్చదనం వైపు అడుగులు వేయాలని, అందరూ మొక్కలు నాటాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌నాయక్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి 11 ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది వనమహోత్సవం సందర్భంగా సంస్థ వ్యాప్తంగా 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అధికారులు, ఉద్యోగులంతా వన మహోత్సవంలో పాల్గొనాలని సూచించారు. 'నీటి బిందువు – జల సింధువు'కార్యక్రమంలో భాగంగా మినీ చెరువులు నిర్మించాలని, సింగరేణి వ్యాప్తంగా సమీప గ్రామాల్లో 43 చెరువుల్లో పూడిక తీయాలని నిర్ణయించామని తెలిపారు. వీటిలో ఇప్పటివరకు నాలుగు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలని, ఇకపై జీ – 14, 15 గ్రేడ్‌ల బొగ్గు రవాణాను పూర్తిగా నిలిపేసి జీ – 13 గ్రేడ్ బొగ్గు మాత్రమే సరఫరా చేయాలని చెప్పారు. చిన్న పరిశ్రమల కోసం హైదరాబాద్ సమీపంలో బొగ్గు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనుల్లో సాండ్ స్టోయింగ్ కోసం గోదావరి నది నుంచి ఇసుక క్వారీ ఏర్పాటుకు అనుమతులు సాధించాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు ఎం.సత్యనారాయణరావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'బత్తుల'ఆశయ సాధనకు కృషి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గుమ్మడి నర్సయ్య, రమేశ్, శివలింగం తదితరులు

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సత్తుపల్లి: వ్యవస్థలోని దోపిడీ, దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన బత్తుల వెంకటేశ్వరరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తెలిపారు. సత్తుపల్లిలో శనివారం రాత్రి జరిగిన సమావేశంలో శివలింగం రచించిన 'విప్లవోద్యమ తొలికిరణం – త్యాగాల జీవితం బత్తుల వెంకటేశ్వరరావు జీవన రేఖలు'పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం కొండపల్లి విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. బత్తుల వెంకటేశ్వరరావు వ్యవస్థలోని దోపిడీ, దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూనే ప్రజల్లో చైతన్యం కోసం అమరుడయ్యారని తెలిపారు. నక్సల్బరీ ఉద్యమంలో చురుకైన పాత్ర వహించిన ఆయన ఆశయాలు స్ఫూర్తి దాయమకమని పేర్కొన్నారు. దుర్మార్గమైన పద్ధతుల్లో ప్రజలను రెచ్చగొట్టి బత్తుల వెంకటేశ్వరరావుతో పాటు బిజ్జ వెంకన్నను పోలీసులు చిత్రహింసలకు గురిచేసి ఎన్‌కౌంటర్ చేయడమే కాక ఎదురుకాల్పుల్లో చనిపోయారంటూ ప్రచారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో విద్య పరిరక్షణ కమిటీ జాతీయ నాయకులు టి.రమేశ్‌పట్నాయక్, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, బీపీఎంటీ ట్రస్ట్ కార్యదర్శి కూకలకుంట రవితో పాటు బత్తుల భరత్, ఏ.లింగారావు, ఎస్.కే.బుర్హాన్, ఎం.సత్యనారాయణ, ఎస్.కే.అజీజ్, అమర్లపూడి రాము, భాస్కర్, ఏ.వెంకన్న, గంటా శ్రీను, లాజర్, గోకినేపల్లి లలిత, అమర్లపూడి శరత్, కటినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్‌పై దాడులను ఖండించండి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను అందరూ ఖండించాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ఆధ్వర్యాన ఇజ్రాయిల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను ఉల్లంఘిస్తూ ఇష్టం వచ్చినట్లుగా ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని, వీటిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. యావత్ పశ్చిమాసియా ప్రాంతాలపై ఇజ్రాయిల్ గుత్తాధిపత్యం సాధించడానికే ఈ దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, ఎస్.కే.మీరాసాహెబ్, దొంగల తిరుపతిరావు, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాసరావు, నాగుల్ మీరా, నర్రా రమేష్, జె.వెంకన్నబాబు, భద్రం, గాలి వెంకటాద్రి, హిమామ్, కూరపాటి శ్రీను, వీరబాబు, నాగేశ్వరరావు, కుమారి, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం..



పిండిప్రోలులో బోదె అచ్చుతోలకాలు



ఎదుళ్లచెరువులో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

ఇన్నాళ్లు ఎండలతో ఉన్న వాతావరణం చల్లబడడం.. వాతావరణ శాఖ అధికారులు రానున్న మూడు రోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా పుష్కలంగా వర్షాలు కురుస్తాయనే కబురుతో రైతన్నలు సాగు పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికే పలువురు రైతులు పత్తి విత్తనాలు విత్తడంలో నిమగ్నం కాగా.. శనివారం మిగిలిన రైతులు అచ్చుతోలకాలు తోలి పత్తి విత్తనాలు నాటారు. వరుణుడిపై భారం వేస్తూ రైతన్నలు కొండంత ఆశతో పంటల సాగులోకి దిగి వానలు కురవాలని వేడుకుంటున్నారు. – తిరుమలాయపాలెం

అటు పనులు.. ఇటు పాట్లు

ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ నుంచి మమతా జంక్షన్ వరకు డ్రైయినేజీ నిర్మిస్తున్నారు. ఇందుకోసం రోడ్డుకు ఎడమ పక్క ఆ చివరి నుంచి ఈ చివరి వరకు తవ్వి పనులు చేస్తున్నారు. ఈక్రమంలో ఇళ్లు, వ్యాపార సంస్థల నుంచి వెలువడుతున్న మురుగునీరు మార్గం మూసుకుపోయింది. దీంతో నిర్మాణ పనులు చేపడుతున్న వారు మోటార్ల ద్వారా డ్రైయినేజీ నీటిని ప్రధాన రహదారిపై విడుదల చేస్తున్నారు. ఈమేరకు రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక డ్రైయినేజీ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు కానీ మట్టి, నిర్మాణ సామగ్రితో రహదారి కుచించుకుపోయి సమస్య ఏర్పడుతోంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



డ్రైయినేజీ నిర్మాణ పనుల్లో కార్మికులు



డ్రైయినేజీ నీటిని పైప్‌తో రహదారిపైకి వదులుతున్న దృశ్యం



రహదారిపై పారుతున్న మురుగునీరు

క్లుప్తంగా

ఘనంగా రామాలయం వార్షికోత్సవం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయం 51వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలమూర్తులకు అభిషేక మహోత్సవం, పుష్పాలంకరణ, పట్టాభిషేక ఉత్సవం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు అనుమోలు సురేష్, కొత్తూరు సత్యనారాయణ, మొరిశెట్టి సాంబశివగుప్తా, భక్తులు పాల్గొన్నారు.

సెంట్రల్ డీఎస్పీగా మేకలతండా యువకుడు


బానోత్ లక్ష్మీవరప్రసాద్

కారేపల్లి: మండలంలోని మేకలతండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బానోత్ రామ్మూర్తి నాయక్ – విజయ దంపతుల కుమారుడు బానోత్ లక్ష్మీవరప్రసాద్ సెంట్రల్ డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. యూపీఎస్సీ నిర్వహించిన సీఏపీఎఫ్ ఎక్జామ్‌లో 256వ ర్యాంక్ సాధించి సీఏపీఎఫ్ సెంట్రల్ డీఎస్పీగా సెలెక్ట్ అయ్యారు. దీంతో యువకుడిని మండల ప్రజలు అభినందించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

తల్లాడ: పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. శనివారం తల్లాడలోని కుర్నవల్లి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సీపీఎం సత్తుపల్లి డివిజన్ రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్‌గా సత్తుపల్లి డివిజన్ సీపీఎం కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి వ్యవహరించగా.. రాజకీయాలు వాటి ఆవశ్యకతపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యుడు మల్లెంపాటి వీరభద్రరావు బోధించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాచర్ల బారతి, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, విఠల్, పాండురంగారావు, రామలింగేశ్వరరావు, కృష్ణార్జున్‌రావు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ కోసం కృషి చేస్తా

వైరా: మున్నూరు కాపు కుల కార్పొరేషన్ ఏర్పాటు కోసం తన వంతు కృషి చేస్తానని టీపీసీసీ కార్యదర్శిగా నియమితుడైన కట్ల రంగారావు అన్నారు. శనివారం వైరాలోని 12వ వార్డు రేచర్ల బజార్‌లో మున్నూరు కాపు కుల సంఘం ఆధ్వర్యంలో కట్ల రంగారావుకు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, రేచర్ల నాగేశ్వరరావు, రాముడు, కట్ల నాగరాజు, కామిశెట్టి రవికుమార్, కట్ల సంతోష్, కుటుంబరావు, నాగేంద్రరావు, పుల్లయ్య, సీతారాములు, మహేష్, శ్రీకాంత్, అక్కిశెట్టి రవితేజ, సైదులు సత్యం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న విద్యార్థిని ఉపాసన (ఫైల్)


మల్టీశాటిలైట్ సిగ్నల్ రిసీవర్ యాంటినాతో హెచ్‌ఎం రాజాలిపాషా



పెద్దతండా ప్రాథమికోన్నత పాఠశాల

శాటిలైట్ టీవీతో విద్యాబోధన

- పెద్దతండా పాఠశాల హెచ్‌ఎం రాజాలిపాషా ప్రత్యేకత
- ఇన్నోవేషన్‌లో..రాష్ట్ర స్థాయి గుర్తింపు

కారేపల్లి: మండలంలోని పెద్దతండా (భాగ్యనగర్ తండా) ప్రాథమికోన్నత పాఠశాలలో శాటిలైట్ టీవీతో విద్యాబోధన పలువురిని ఆకట్టుకుంటుంది. ఆ పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే రాజాలిపాషా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వినూత్న బోధన విధానాన్ని అవలంభిస్తూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభకు పదును పెడుతున్నారు.

విద్యార్థులను ఆకట్టుకునేలా..

పాఠశాలలో విద్యార్థులను ఆకట్టుకునేలా శాటిలైట్ టీవీని వినియోగించి బోధన చేస్తున్నారు. హెచ్‌ఎం సారథ్యంలో విద్యార్థులు మల్టీశాటిలైట్ సిగ్నల్ రిసీవింగ్ యాంటినాను తయారు చేశారు. అదే రిసీవర్ యాంటినా ద్వారా 300లకు పైగా టీవీ చానల్స్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచి విద్యనందించటం ద్వారా పాఠశాలకు గుర్తింపు వచ్చింది. ప్రైవేట్ ధీటుగా విద్యాబోధన సాగుతుండడంతో పాఠశాలలో ప్రవేశాల సంఖ్య పెరుగుతుందని హెచ్‌ఎం తెలిపారు.

ఇన్నోవేషన్‌లో రాష్ట్రస్థాయి అవార్డు..

రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ సెల్ సైన్స్ ప్రొగ్రాంలో యూపీఎస్ పెద్దతండా (భాగ్యనగర్‌తండా) విద్యార్థి ఎం.ఉపాసన రాష్ట్రస్థాయి అవార్డు సాధించింది. మల్టీశాటిలైట్ సిగ్నల్ రిసీవింగ్ యాంటినా తయారు చేసినందుకు గాను ఈ అవార్డును అందుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పడిన 500ల మంది విద్యార్థుల్లో 20మంది ఎంపిక కాగా, వారిలో ఎం.ఉపాసన ఒకరు. దీంతో విద్యార్థినికి, ప్రోత్సహించిన హెచ్‌ఎం.. కలెక్టర్ చేతులమీదుగా అవార్డును సైతం అందుకున్నారు.

ఆదర్శవంతంగా పాఠశాల నిర్వహణ..



పిల్లల తల్లిదండ్రుల ప్రోత్సాహం, పాఠశాల ఉపాధ్యాయుల కృషితో పెద్దతండా ప్రాథమికోన్నత పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చింది. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా బోధన చేస్తుండటంతో వారిలో నేర్చుకోవాలనే తపన పెరిగి బడికి ఉత్సాహంగా వస్తున్నారు. విద్యార్థుల మనోవికాసాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ఎస్‌కే.రాజాలిపాషా, హెచ్‌ఎం, పెద్దతండా

రాజీ మార్గమే రాజమార్గం


సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

మధిర/సత్తుపల్లిటౌన్: కేసులను పరిష్కారంలోలో రాజీ మార్గమే.. రాజ మార్గమని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్, మధిర కోర్టు న్యాయమూర్తి ఎస్.ప్రశాంతి తెలిపారు. శనివారం మధిర కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్.ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో.. మధిర కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల కూడా పాల్గొని పలు కేసులు పరిష్కరించారు. మధిర ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 289కేసులు పరిష్కారం కాగా రూ.1,32,900జరిమానా విధించారు. అదేవిధంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 240 కేసులు పరిష్కారం కాగా, రూ.3,86,800జరిమానా విధించారు. అదే విధంగా సత్తుపల్లి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జి శ్రీనివాస్ పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో రాజీ అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని స్పష్టం చేశారు. రాజీ చేసుకుంటే ఇరువురు గెలుస్తారని, సమయం, డబ్బు ఆదాఅవుతుందన్నారు. క్షణికావేశంలో జరిగిన కేసులకు రాజీపడేందుకు ఇది మంచి అవకాశమన్నారు. ఈ సందర్భంగా పలువురి బాధితులకు అవార్డులు సైతం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి షేక్ మీరాఖాసీం సాహెబ్, జూనియర్ సివిల్ జడ్జి బి.సుమబాల, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్‌లు జె.గోపాలరావు, అబ్రహం, బార్ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, మల్లెపూల వెంకటేశ్వరరావు, ఏపీపీ భద్రయ్య, మధిర పట్టణ సీఐ రమేష్ ,ఎస్సై చంద్రశేఖర్, బ్యాంక్ అధికారులు, పోలీస్, కోర్టు సిబ్బందితో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.



జేవీఆర్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు


కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న దయానంద్

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన షెడ్ల నిర్మాణంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటామని పూర్వ విద్యార్థి సంఘం బాధ్యుడు మట్టా దయానంద్ అన్నారు. శనివారం కళాశాలను సందర్శించి కళాశాల మైదానంలోని క్రీడాకారులతో మాట్లాడారు. ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వాకర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి, దొడ్డా శ్రీనివాసరావు, ఇమ్మినేని ప్రసాద్, వెంకటరమణ, దిలీప్, జె.వంశీ, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి మిర్చి కొనుగోళ్లు


మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ నర్సింహారావు

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మిర్చి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ రబీలో రైతులు సాగు చేసిన ధాన్యాన్ని స్వయం సహాయక సంఘాల ద్వారా కొనుగోలు చేశారని పేర్కొన్నారు. మూడు మండలాల్లో 1,035 మంది రైతుల వద్ద 51,207 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మద్దతు ధర రూ.12 కోట్లతో పాటు సన్నధాన్యానికి బోనస్ కూడా ఖాతాల్లో జమ అయిందని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సహకారంతో మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ అద్దంకి రవికుమార్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

జూలై 7న స్నాతకోత్సవంలో అందజేత


వేముల సంధ్య | సముద్రాల రచన | మద్దోజు తేజశ్విని | కాటేపల్లి శివాని

కొణిజర్ల: కాకతీయ యూనివర్సిటీ ఇటీవల ప్రకటించిన బీఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సు ఫలితాల్లో కొణిజర్ల మండలం అమ్మపాలెం పంచాయతీ పరిధిలోని బ్రౌన్స్ ఫార్మసీ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. యం ఫార్మసీ కోర్సులో వేముల సింధు (2018), 2019 సంవత్సరానికి గాను బీఫార్మసీలో సముద్రాల రచన 4 బంగారు పతకాలు సాధించింది. 2021 సంవత్సరానికి గాను బీఫార్మసీలో మద్దోజు తేజశ్విని, కాటేపల్లి శివానీలు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, సెక్రటరీ కరస్పాడెంట్ పారుపల్లి విజయలక్ష్మి బంగారుపతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. జూలై 7న కాకతీయ స్నాతకోత్సవంలో విద్యార్థులకు బంగారు పతకాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాథ్ పాత్రో, ఏఓ సీహెచ్ హనుమంతరావు, అధ్యాపక బృందం అభినందించారు.

విద్యుత్ సమస్యలపై సంప్రదించండి

సత్తుపల్లి: సత్తుపల్లి డివిజన్‌లో ఏ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోనైనా విద్యుత్ సరఫరాలో సమస్యలు, అంతరాయాలు జరిగితే స్థానిక విద్యుత్ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలని డీఈఈ ఎల్.రాములు తెలిపారు. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న నంబర్లను టీజీఎన్‌పీడీసీఎల్ మార్చినందున కొత్త ఫోన్ నంబర్లను తెలిపారు. డీఈఈ 8712483728, ఏఈ టెక్నికల్ 8712483729, ఏఈ కమర్షియల్ 8712483730, సత్తుపల్లి ఏడీఈ 8712483791, సత్తుపల్లి టౌన్ ఏఈ 8712483770, సత్తుపల్లిరూరల్ ఏఈ 8712483762, వేంసూరు ఏఈ 8712483782, రాయుడుపాలెం ఏఈ 8712483757, పెనుబల్లి ఏడీఈ 8712483754, పెనుబల్లి ఏఈ 8712483750, లంకపల్లి ఏఈ 8712483742, కల్లూరు ఏఈ 8712483732, పెద్దకోరుకొండి 8712483756, తల్లాడ ఏడీఈ 8712483803, తల్లాడ ఏఈ 8712483812, కుర్నవల్లి ఏఈ 8712483799, ఏన్కూరు ఏఈ 8712483797లకు సంప్రదించాలని కోరారు.

బీమా చెక్కు అందజేత


మృతుడి భార్యకు చెక్కు అందిస్తున్న మంజుల

వైరా: వైరా మున్సిపాలిటీలోని శాంతినగర్‌కు చెందిన ఎక్కిరాల వెంకటేశ్వర్లు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయనకు బీఆర్ఎస్‌పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉండటంతో ఆయన కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును వైరా మాజీ ఎమ్మెల్యే దివంగత బానోత్ మదన్‌లాల్ సతీమణి మంజుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైరా మాజీ వైస్ ఎంపీపీ జ్యోతి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, కిరణ్, సురేష్, రాము, కిషోర్, ప్రేమ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలో శనివారం అపోలో ఫార్మసీ ఆధ్వర్యాన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 35మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, కళాశాల కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్‌రాజా, ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ దాసరి ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జ్ గంటా మానస, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నడవాలంటే నరకమే..

– అధ్వానంగా మారిన సాగర్ కాల్వ బ్రిడ్జి రోడ్డు


బురదమయంగా మారిన సాగర్‌కాల్వ బ్రిడ్జిరోడ్డు

కల్లూరురూరల్: సాగర్‌కాల్వ బ్రిడ్జిపై నిర్మించిన రోడ్డుపై ప్రజలు ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. వివరాల్లోకి వెళ్తే.. కప్పల బంధంలోని సాగర్ ప్రధాన కాలువపై నిర్మించిన బ్రిడ్జిపై రోడ్డు గుంటలు పడి నీరు నిల్వ ఉండడంతో దానిపై వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరామాపురం, ఎన్నెస్పీ కల్లూరు వెళ్లేందుకు ఈ బ్రిడ్జియే ప్రధాన మార్గం కావడంతో ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు చెప్పలేనివి. కొత్త రోడ్డు దేవుడెరుగు ఉన్న రోడ్డుకైనా మరమ్మతులు చేయించి రాకాపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధిక ఫీజులు వసూలు చేయొద్దు..


ఎంఈఓ దామాల పుల్లయ్య

బోనకల్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంఈఓ దామాల పుల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించవద్దని, ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


సంక్షిప్త సమాచారం

యోగాతోనే ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న ఆయుర్వేద వైద్య సిబ్బంది

మధిర: ప్రతిరోజు యోగా చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు వెంకట్ లాల్ తెలిపారు. శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మధిర ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు యోగా చేయాలని, తద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు కందుల రాంబాబు, గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఝాన్సీ

కారేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ అన్నారు. శనివారం మండలంలోని టేకులపల్లిలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులనే, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్నదన్నారు. జూన్ 21,22 తేదీల్లో నిజామాబాద్‌లో కార్మిక సమస్యలపై జరిగే టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి ఉమ్మడి సందీప్, నాయకులు తేజ్యానాయక్, భాస్కర్, సక్రు, సత్తిరెడ్డి, సరోజిని, అనసూర్య, లఘుపతి, రంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

కొణిజర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రా బాబు అన్నారు. శనివారం మండలంలోని చిన్నమునగాలలో నాగవరపు భద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం శాఖ కార్యదర్శిగా పాపగంటి సుదర్శన్, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి నాగయ్యలతో పాటు మరో 11మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, సుదర్శన్, భద్రయ్య, సంసోన్, నాగయ్య, విజయ్‌కుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న భాగం హేమంతరావు

మధిర: మధిర పట్టణంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. శనివారం స్థానిక రిక్రియేషన్ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించిన సీపీఐ ఆహ్వాన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కులపై చర్చించడం జరుగుతుందన్నారు. కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి మహాసభల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బెజవాడ రవిబాబు, మందడపు రాణి, ఊట్ల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ మరణం పార్టీకి తీరని లోటు

తల్లాడ: కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి తేజావత్ బాలాజీ నాయక్ మరణం బీజేపీ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని అంజనాపురంలో నిర్వహించన ఆయన సంస్మరణ సభలో బీజేపీ నాయకులు పాల్గొని, బాలాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్లు నిర్మించాలని వినతి..


వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరారూరల్: మండలంలోని తాటిపూడిలో వైరా రిజర్వాయర్ కుడి కాలువ ఆధునికీకరణ పనులలో భాగంగా భక్తులు కార్తీక మాసాల్లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు కాలువకు ఇరువైపులా మెట్లు నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ వెంకటకృష్ణకు శనివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాగరాజు, జయరాజు, నిర్మల, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.